## క్లుప్తంగా

### 22 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: మండలంలోని చినబూరాడపేటలో బెల్ట్‌షాపుపై దాడి చేసి 22 మద్యం సీసాలు స్వా. దీనం చేసుకున్నట్లు ఎస్సై పి. నారాయణరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ దుకాణం నుంచి 22 సీసాలు సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు మండలంలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

### ఆక్రమణపై ఫిర్యాదు



స్థలం ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణపై ప్రిన్సిపాల్ టి.నగేష్‌కుమార్ రెవెన్యూ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కళాశాల ఆవరణలో కొంతమంది ఆక్రమణదారులు పోల్స్ వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ లావణ్య స్పందిస్తూ ఆక్రమణదారులుపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ టి.సీతారాం , తదితరులున్నారు.

### అభ్యంతరాలు తెలియజేయండి

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధి 16వ వార్డులోనున్న అనధికార దాట్ల లేఅవుట్‌ను వీఎంఆర్‌డీఏ ద్వారా గతనెల 23న క్రమబద్ధీకరించినట్లు కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు లే అవుట్ వివరాలను నగర పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డులో, 8వ వార్డు సచివాలయంలో ప్రచురించినట్లు పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ విషయంలో ఎటువంటి అభ్యంతరాలున్నా రాతపూర్వకంగా గాని ఈ మెయిల్ ద్వారా గాని తెలియజేయాలని కమిషనర్ సూచించారు. అభ్యంతరాలను 15 రోజుల్లోగా తెలియజేయాలన్నారు.

### ముగిసిన 'గ్రామరథాన్' వర్క్‌షాపు



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న సదస్సు నిర్వాహకులు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'గ్రామరథాన్' పేరుతో మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన ఎల్ఈడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు ఆర్‌యూ నరసింహం మాట్లాడుతూ, ఆంగ్ల వ్యాకరణం విషయాలను ఇతరులతో పంచుకోవడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఈడబ్ల్యూఎఫ్ సభ్యుడు ఆర్వీజే నాయుడు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### హాస్టళ్లు, రేషన్‌డిపోల్లో తనిఖీలు

గజపతినగరం: మండల కేంద్రంలోని పలు వసతి గృహాలు, రేషన్ డిపోలు,ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. గజపతినగరం బాలుర కళాశాల వసతి గృహంలో సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్టు గుర్తించి మెమో జారీ చేశారు. మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌లో సరుకుల నిల్వలకు సంబంధించి బోర్డులు లేకపోవడంతో అక్కడి సిబ్బందికి మెమో జారీ చేశారు.

### తాడమ్మతల్లి జాతర ఏర్పాట్లపై సమీక్ష

మెరకముడిదాం: గర్భాంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న తాడమ్మతల్లి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు సూచించారు. జాతర ఏర్పాట్లపై గర్భాం సచివాలయం వద్ద అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వేలాది మంది భక్తులు వస్తారని, గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతిని ఆదేశించారు. 24న సిరి మానోత్సవం ఉంటుందని, సిరిమాను ఊరేగించే ప్రాంతాల్లో మాత్రమే ఊరేగింపు సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని, మిగతా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

# ముందుకొస్తున్నారు...

- పన్ను చెల్లింపులకు స్పందన
- 5 శాతం రాయితీ కల్పిస్తోన్న ప్రభుత్వం
- నగర పరిధిలో 4,597 అసెస్‌మెంట్ల నుంచి రూ.1.65 కోట్లు వసూలు
- ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందంటున్న అధికారులు



పన్ను చెల్లించేందుకు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన భవన యజమానులు



పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం కల్పించిన 5 శాతం రిబేట్ పథకానికి విజయనగరం కార్పొరేషన్ పరిధిలో స్పందన లభిస్తోంది. ప్రతి ఏడాదీ ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో ఏడాదికి సంబంధించిన పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించేవారికి ఈ ఆఫర్‌ను వర్తింపచేస్తుండగా... నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 శాతం రిబేట్‌పై 14,770 అసెస్‌మెంట్ల నుంచి రూ.7.26 కోట్లు వసూలైనట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతకన్నా ఎక్కువ మొత్తంలో పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఏడాదీ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీలోగా ముందుస్తుగా ఆస్తి పన్ను చెల్లించేవారికి ప్రభుత్వం రిబేట్ సౌకర్యం కల్పిస్తోంది. అయితే గతేడాది పన్ను బకాయిలు మాత్రం పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో పన్నులు వసూలు చేయలేదు. అనంతరం వరుస సెలవులు వచ్చాయి. నాలుగు రోజులుగా రిబేట్‌పై పన్నులు వసూలు చేస్తుండగా.. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి చెల్లిస్తున్నారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా... ఇప్పటివరకు 4,597 అసెస్‌మెంట్ల నుంచి రూ.1.65 కోట్లు వసూలైనట్లు అధికారులు చెబుతున్నారు.

#### గతేడాది బకాయిదారులపై ప్రత్యేక దృష్టి..

గత ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిలు చెల్లించని వారిపై కార్పొరేషన్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పాత, కొత్త బకాయిలు కలిపి రూ.43.49 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా... రూ.37.99 కోట్లు వసూలు చేశారు. ఇంకా కొంతమంది మొండి బకాయిదారులు పన్ను చెల్లించలేదు. దీంతో కార్పొరేషన్ కమిషనర్ మొండిబకాయిదారుల జాబితాను సిద్ధం చేసి పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు.

#### సద్వినియోగం చేసుకోవాలి..



ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రిబేట్ అవకాశం కల్పిస్తోంది. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 30 వరకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. రిబేట్ ఆఫర్‌పై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

## మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం



32వ డివిజన్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 32వ డివిజన్‌లోని తోటపాలెం మౌర్య రెసిడెన్సీ పరిసరాల్లో స్థానికులతో కలసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా... వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోలగట్ల ఆదేశించారు. ముఖ్యంగా వీధిదీపాలను తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అలాగే రహదారి సౌకర్యం కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు సంతోషం వ్యక్తం చేయడంపై ఆనందంగా ఉందన్నారు. మౌర్య అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో వీధి దీపాలు, డంపర్ బిన్‌లు, రహదారుల ఏర్పాటుపై అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. సకాలంలో పన్నులు చెల్లించే కాలనీవాసులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం ఉందని తెలిపారు. పనిచేసే వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రెయిన్ బో అపార్ట్‌మెంట్‌కు ఆనుకుని రహదారి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. అవినీతి, లంచగొండితనం లేని పాలనే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమన్నారు. సమావేశంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, రవిచంద్ర, మారం బాలబ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు, మౌర్య గార్డెన్స్ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, కార్యదర్శి మోహనరావు, కార్పొరేషన్ డీఈ అప్పారావు, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదు..

- ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫెల్



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

విజయనగరం టౌన్: సొంత నిర్ణయాలతో ఉద్యోగులను వేధించడం బాధాకరమని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫెల్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో ఉన్న ఎన్‌ఎంయూ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌ను డిపో మేనేజర్ బేఖాతారు చేస్తున్నారని మండిపడ్డారు. రోజుకు 12 గంటలు పని చేయించుకుని, కేవలం ఎనిమిది గంటలకు మాత్రమే జీతం ఇస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ప్రత్యేకంగా మూడు రోజుల స్పెషల్ లీవ్ ఉన్నప్పటికీ, ఒక రోజు మాత్రమే ఇస్తామని చెప్పడం తగదన్నారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు బి.రామారావు, డిపో కమిటీ సభ్యులు జీవీఎం. శ్రీనివాస్, కేవీ ఆర్ రాజు, జీపీ రావు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం పూల్‌బాగ్: నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఒంటిపూట బడులు నిర్వహించాల్సిన సమయంలో కూడా కొన్ని విద్యా సంస్థలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. పలు కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ విద్యార్థులకు అనధికారికంగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు దీవెన, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో యువతే కీలకం



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సామాజిక సేవలో యువతరం కీలక భూమిక పోషించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ యూత్ వింగ్ అధ్యక్షుడిగా కార్తీక్, కార్యదర్శిగా వెంకన్న బాబు ఎంపికకావడంతో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ఇప్పటివరకు నగరంలో చేపట్టిన అనేక సామాజిక కార్యక్రమాలలో చాంబర్ ఆఫ్ కామర్స్ పాత్ర మరువరానిదన్నారు. ఇదే ఒరవడిలో యూత్‌వింగ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే నూతన ఆవిష్కరణలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. సమష్టి కృషితో సంస్థ ఆర్థిక పురోభివృద్ధికి కూడా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, రవ్వా శ్రీనివాసరావు, వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

నెల్లిమర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ పి. బాలాజీప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు టీవీ రమణ మాట్లాడుతూ జనవరి, మార్చి నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. 15 రోజుల క్యాజువల్ లీవ్ జీఓను అమలు చేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన తోపుడు బళ్లు, డస్ట్‌బిన్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సిబ్బందికి మాస్క్‌లు, గ్లౌజులు, చెప్పులు, సబ్బులు, తదితర వస్తువులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో బాబూరావు, శ్రీనివాస్, పైడిరాజు లక్ష్మి, శశిరేఖ, సురేష్, తదితరులున్నారు.

## సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ



ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని కొండకరకాంలో రెండోరోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాల మంజూరులో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో లంచం ఇస్తే తప్ప సంక్షేమ పథకాలు మంజూరయ్యేవి కావని.. ప్రస్తుత జగనన్న హయాంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్ మోహన్‌రెడ్డికే మద్దతు పలకాలని కోరారు. అనంతరం పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కిలారి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ, కొండకరకాం గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజల నుంచి లభించిన ఆదరణ చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా వీరభద్రస్వామిని, ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, సర్పంచ్ కిలారి రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణ, పార్టీ నాయకులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్..'



నెల్లిమర్ల: సంక్షేమ పథకాల బ్రోచర్లు అందిస్తున్న గృహ సారథులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి 17వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ పోలుబోతు నారాయణమూర్తి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనను వివరించారు. పథకాల అమలుపై స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మద్దిల ముత్యాల నాయుడు, వలంటీరు కొంకి సంతోష్, గృహ సారథులు మద్దిల గౌరి, బోని రత్నం పాల్గొన్నారు.

#### జగనన్నే మా భవిష్యత్

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా జరుగుతోంది. మండలంలోని రఘుమండ, డెంకాడ, ఆర్.తమ్మాపురం, నాతవలస, సింగవరం, తదితర గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజలకు జరుగుతున్న మేలును వివరించడంతో పాటు పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్‌లు గూడేల విష్ణు, పుర్రి సంతోషి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టా అప్పారావు, లెంక అప్పలనాయుడు, సంచాన కృష్ణమూర్తి, బమ్మిడి వెంకటరమణ, పాండ్రంకి ఆదినారాయణ, గోపిరాజు, శంకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



డెంకాడ: రఘుమండలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వాసుదేవరావు, సర్పంచ్ విష్ణు, తదితరులు



డెంకాడ: డెంకాడలో ఇంటింటికీ వెళ్లి అభిప్రాయాలు తెలుసుకుంటున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కనకసింహాచలం, తదితరులు

## కలెక్టర్ నాగలక్ష్మికి అభినందనలు



కలెక్టర్ చాంబర్ ఎదుట ఉద్యోగులు, అధికారుల సందడి

విజయనగరం అర్బన్: నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మి సెల్వరాజ్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. కలెక్టర్‌ని కలిసి అభినందించిన వారిలో రెవెన్యూ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద్, ప్రధాన కార్యదర్శి రమణరాజుతో పాటు సంఘం ప్రతినిధులు, పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ సంఘాలలో ఎస్టీయూ ప్రతినిధులు కె.జోగారావు, డి.శ్యామ్, తదితరులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం



వనంగుడిలో చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి వనంగుడిలో బుధవారం చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షణలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి శాస్త్రోక్తంగా యాగం చేపట్టారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను యాగంలో పాల్గొన్న భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్, ట్రస్టుబోర్డు సభ్యులు నక్కా జ్యోతి, బలివాడ పార్వతి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రూ. 26.05 లక్షలతో అభివృద్ధి పనులు

- ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 43వ డివిజన్‌లో రూ.26.05 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు బుధవారం ప్రారంభించారు. పాల్‌నగర్ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన రహదారులను ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయుడని కొనియాడారు. కోలగట్ల ఆధ్వర్యంలో నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ నాయకుడు వంతరం సురేష్, తదితరులు పాల్గొన్నారు.